క్లుప్తంగా

దంచికొడుతున్న వానలు... ఆందోళనలో రైతులు



జమ్మాదేవిపేట గ్రామం సమీపంలో నీటి మునిగిన వరి పంట

లక్కవరపుకోట: సోమవారం రాత్రి నుంచి వర్షం ఏకధాటిగా దంచి కొడుతోంది. దీంతో గెడ్డలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండకుండలా మారాయి. ముఖ్యంగా రంగరాయపురం, జమ్మాదేవిపేట, మల్లివీడు తదితర ప్రాంతాల్లో గల వరి ఉభాలు మునిగిపోయాయి. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఖరీఫ్ వరి పంట నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఓ పక్కకు ఒరిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందనున్న సిమెంటు దిమ్మ విరిగిపోయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఓవైపు ఒరిగిపోయింది. అయితే సకాలంలో విద్యుత్ సిబ్బంది సరఫరా నిలిపివేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపండి



కొండగంగుబూడిలో గిరిజన ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో మరుగుదొడ్లును పరిశీలిస్తున్న జడ్జి విజయచందర్

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతిగృహాలను కొత్తవలస జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎస్.విజయచందర్ సందర్శించారు. మరుగుదొడ్లు గదులకు తలుపులు లేకపోవడంతో పాటు చిన్న మరమ్మతులు గుర్తించిన ఆయన ఐటీడీఏకు నివేదించి మరమ్మతులు చేయించాలని సూచించారు. అనంతరం తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులను పలు సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల యూనిఫాంలు, బూట్లు తదితర కిట్లు పరిశీలించారు. భోజనాలపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆయన వెంట వల్లంపూడి ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెచ్‌సీ శివకేశవరావు, కానిస్టేబుళ్లు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూగజీవాల పట్ల తస్మాత్...

వేపాడ: వర్షాలు పడుతున్న దృష్ట్యా పశువులు, జీవాల పట్ల యాజమాన్య పద్ధతులు పాటించి పిడుగుపాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వేపాడ పశువైద్యాధికారిణి డాక్టరు గాయిత్రీ అన్నారు. స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ వరుసగా వర్షాలు పడుతున్నందున పశువులను ఎత్తైన ప్రదేశాలల్లో వుంచాలన్నారు. పశువులకు శుభ్రమైన మేత, నీరు అందుబాటులో వుంచాలన్నారు. మేత కోసం మేకలు, గొర్రెలు తీసుకెళ్లినప్పుడు చెట్లు నీడలో వుండకుండా ఎత్తైన ప్రదేశంలో వుండేటట్లు చూడాలన్నారు. ఉరుములు, మెరుపులు పశువులను రక్షించేందుకు సరైన షెడ్లల్లో వుంచాలన్నారు. రైతులు, గొర్రెలు, మేకలు కాపర్లు సెల్ ఫోన్ స్విచ్ అప్ చేసి వుంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో పశు సంపదకు నష్టం వాటిల్లకుండా విద్యుత్ స్తంభాలకు, తీగలకు దూరంగా వుంచాలన్నారు. నీటి వనరులకు దూరంగా వుండాలన్నారు. పశువులను గుంపులుగా కాకుండా విడివిడిగా ఉంచటం మంచిదన్నారు.

పంచాయతీ తీర్మానాలను తుంగలో తొక్కారు.. : ఎమ్మెల్సీ




ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: నాడు భూములు ఇచ్చినపుడు చేసిన పంచాయతీ తీర్మానాలను తుంగలో తొక్కి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్వాసితులను జిందాల్ యాజమాన్యం ముంచేసిందని ఎమ్మెల్సీ రఘురాజు ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన బొడ్డవరలో తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జిందాల్ నాడు భూములు తీసుకున్న సమయంలో పంచాయతీలో కొన్ని ఒప్పందాలు చేయించి తీర్మానాలు ఇచ్చారని గుర్తు చేశారు. నాటి సర్పంచ్‌లు ఉపాధి, ఉద్యోగం వస్తుందని ప్రజల్ని ఒప్పించి తీర్మానాలు చేసి ఇస్తే వాటిని పక్కన పెట్టి నేడు జిందాల్ అడ్డగోలు వ్యవహారాలు చేస్తోందన్నారు. ముషిడిపల్లి రోడ్డుకి ఇరువైపులా ఉన్న తాటిపూడి నిర్వాసితుల భూముల ప్రస్తావన నాడు లేకపోగా, ఆ భూముల్ని జిందాల్ కాజేసిందన్నారు. నాడు నిర్వాసితులకు జిందాల్ 9అంశాలపై తీర్మానాలు చేయగా ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఇన్ని రోజులుగా జిందాల్ మోసాలను ఒక్కొక్కటిగా చెబుతున్నా అధికారులకు మాత్రం చెవికి ఎక్కటం లేదన్నారు.

వసతిగృహంలో నాసిరకం పనులు

- రెండో రకం మెటీరియల్‌తో విద్యుద్దీకరణ
- కన్సీల్డ్‌కు బదులు గోడలపై నుంచి కరెంటు పైపులు
- రూ.2.5 లక్షల నిధులకు రెక్కలు
- హెచ్‌డబ్ల్యూవో సూచనలు పట్టించుకోని వైనం





వసతిగృహంలో గోడల పై నుంచి పైప్‌లు వేసి వైరింగ్ , (ఇన్‌సెట్లో) గోల్డ్ మెడల్ మెటీరియల్ వినియోగం

చీపురుపల్లి:

ఇళ్లు వదిలిపెట్టి చదువు కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వసతిగృహాల్లో పేద విద్యార్థులు ఉంటారు. అలాంటి విద్యార్థులు ఉన్న చోట ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎన్నో జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. అయితే పట్టణంలోని సాంఘిక సంక్షేమ కళాశాలల బాలుర వసతి గృహంలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పర్యవేక్షణ లోపమో.. లేదంటే మరే ఇతర కారణాలు కావొచ్చుగాని విద్యుద్దీకరణకు సంబంధించి నిబంధనలు పాటించడం లేదు. దీంతో భవిష్యత్‌లో అక్కడుండే విద్యార్థులకు ప్రమాదాలు జరిగితే ఎవరు సమాధానం చెబుతారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యుద్దీకరణకు సంబంధించి విడుదలైన రూ.2.5 లక్షల నిధులకు రెక్కలొచ్చినట్లేనని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే వసతిగృహంలో తాజాగా జరుగుతున్న విద్యుద్దీకరణ పనుల్లో నాణ్యత లేదని, విద్యార్థులకు అవసరమైన విధంగా పనులు జరగడం లేదని, నాసిరకం మెటీరియల్ వినియోగిస్తున్నారని సాక్షాత్తూ వసతిగృహ సంక్షేమాధికారి ఆరోపిస్తుండడంపై అక్కడ జరుగుతున్న పనుల్లో నాణ్యత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

రూ.2.5 లక్షల నిధులకు రెక్కలు

సాధారణంగా విద్యుద్దీకరణ పనుల్లో భాగంగా వైరింగ్ విషయంలో కన్సీల్డ్ విధానంలో చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడి వసతిగృహంలో మాత్రం పూర్వపు పద్ధతిలో గోడల పై నుంచి పైపులు వేసి వైరింగ్ చేస్తున్నారు. కన్సీల్డ్ విధానంలో వైరింగ్ చేస్తే విద్యుత్ ప్రమాదాలు జరిగినా కొంత మేర తప్పించుకునే అవకాశం ఉటుందని, ఓపెన్ వైరింగ్‌తో విద్యుత్ ప్రమాదాలు జరిగితే తప్పించుకోలేమని తెలుస్తోంది. దీంతో విద్యుద్దీకరణ కేటాయించిన నిధులకు రెక్కలొచ్చినట్లేనని చర్చ జరుగుతోంది.

నాసిరకం మెటీరియల్ వినియోగం

పట్టణంలోని సాంఘిక సంక్షేమ కళాశాలల బాలుర వసతిగృహం మరమ్మతులకు గురయ్యింది. దీంతో ఆ భవనం మరమ్మతుల కోసం రూ.18.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగానే విద్యుద్దీకరణ పనులు కోసం రూ.2.5 లక్షలు నిధులు కేటాయించారు. అయితే విద్యుద్దీకరణ పనులకు సంబంధించి కోనా, హవెల్స్ వంటి బ్రాండ్‌లకు సంబంధించిన మెటీరియల్ వినియోగించాల్సి ఉన్నప్పటికీ సాధారణ రకం గోల్డ్ మెడల్ బ్రాండ్‌కు చెందిన మెటీరియల్ వినియోగించడం నిబంధనలకు విరుద్ధమేనని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే మెటీరియల్ వినియోగానికి సంబంధించి ఏ బ్రాండ్‌కు చెందిన వస్తువులు వినియోగించాలో అగ్రిమెంట్‌లో ఉంటుందని ఆ పత్రాలు చూపించాలని సంబంధిత ఏఈను కోరినప్పటికీ చూపించకపోవడం వెనుక నాసిరకం మెటీరియల్ వినియోగం జరుగుతోందని స్పష్టమవుతోంది. అంతేకాకుండా రూ.2.5 లక్షలు విద్యుద్దీకరణ పనులకు సంబంధించి ఇద్దరు సబ్ కాంట్రాక్టర్లకు చేతులు మారడం కొసమెరుపు.

ప్రహసనంగా డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

- టీడీపీ నేతల ఇళ్ల వద్ద రేషన్ కార్డుల పంపిణీ
- సర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారం కూడా ఇవ్వని వైనం
- సచివాలయాలను కూడా మరిచిపోయిన సిబ్బంది



కర్లాంలో టీడీపీ నేత ఇంటి వద్ద డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

చీపురుపల్లి: ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం కాస్త టీడీపీ పార్టీ కార్యక్రమంలా మారింది. దీనికి సాక్షాత్తూ టీడీపీ నేతల ఇళ్లల్లో డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తుండడమే చక్కని ఉదాహరణగా నిలుస్తోంది. దీంతో అవి లబ్ధిదారులకు ఇచ్చే డిజిటల్ రేషన్ కార్డులా లేదంటే పార్టీ సభ్యత్వం కార్డులా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజులు క్రితమే గరివిడి మండలంలోని కోనూరులో టీడీపీ ఇంటిలో రేషన్ కార్డులు పంపిణీ చేసిన సచివాలయ అధికారులు మంగళవారం చీపురుపల్లి మండలంలోని కర్లాం పంచాయతీలో అదే విధానం అనుసరించారు. కర్లాం గ్రామంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ తులసి, మహిళా పోలీస్ పద్మ నేతృత్వంలో మంగళవారం 80 డిజిటల్ రేషన్ కార్డులు వరకు పంపిణీ చేశారు. అయితే ఈ కార్డులను ఆ గ్రామంలో ప్రస్తుతం ఎలాంటి హోదా లేని టీడీపీ నేత ఇంటి వద్ద పంపిణీ ప్రారంభించడం చర్చనీయాంశనీయంగా మారింది. ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించాల్సిన అధికారులే దగ్గరుండి నిబంధనలు ఉల్లంఘించి టీడీపీ నేతల ఇళ్లల్లోకి లబ్ధిదారులను పిలిచి డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సర్పంచ్, ఎంపీటీసీలకు కనీసం సమాచారం ఇవ్వకుండా..

కర్లాంలో జరిగిన డిజిటల్ రేషన్‌కార్డులు పంపిణీకి సంబంధించి సచివాలయ ఉద్యోగులు ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలకు కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడం శోచనీయం. కేవలం సర్పంచ్, ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అంతేకాకుండా గ్రామ సచివాలయం లేదా రచ్చబండ వద్ద పంపిణీ చేయాల్సిన డిజిటల్ రేషన్ కార్డులు టీడీపీ నేతల ఇళ్ల వద్ద పంపిణీ చేయడంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం చంద్రబాబు మోసకారి



కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

గంట్యాడ: మోసం చేయడంలో సీఎం చంద్రబాబుకు మించిన వారు లేరని జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. మండలంలోని లక్కిడాం, బుడతానపల్లి గ్రామంల్లో మంగళవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు తొలగించిన పింఛన్లు ఇవ్వాలన్నారు. పింఛన్ నిలుపుదలకు సంబంధించిన నోటీసులు ఇవ్వడం వల్ల అనేక చోట్ల దివ్యాంగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అధికారంలోకి రావడం కోసం దివ్యాంగులకు ఫించను రూ.6 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత ఉన్న దివ్యాంగుల పింఛన్లు తగ్గించి భారాన్ని తగ్గించుకోవాలని చూడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు జాగరపు అప్పారావు, ఉపాధ్యక్షులు వర్రి మల్లయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, యువజన విభాగం అధ్యక్షులు కె.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు పి.వెంకటరావు, లక్కిడాం ఎంపిటీసీ కిలపర్తి రామలక్ష్మి, బుడతానపల్లి సర్పంచ్ అలమండ వాణి, ఎంపీటీసీ వర్రి అర్జునమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు జాగరపు సత్యారావు, లచ్చిరెడ్డి కృష్ణ, కృష్ణంరాజు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు చేస్తాం...



బోరు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని గర్భాం రోడ్డులో బోరుకు మరమ్మతులు చేపట్టి నిర్మిస్తామని మండలాధికారులు తెలియజేశారు. గర్భాం రోడ్డులో గల వీధిలో ఉన్న హ్యాండ్ బోరును స్థానిక వ్యక్తి తీసేసి స్థలాన్ని ఆక్రమించుకున్నాడని, దీంతో తాగునీటి సమస్య ఏర్పడుతుందని స్థానికులు గత కొన్నాళ్లుగా గగ్గోలు పెడుతూ ఇటీవల మండలాధికారులకు, కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో బి.సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఎస్ఐ బి.లోకేశ్వరరావు బోరు తీసేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ విషయంలో ఎస్ఐ లోకేశ్వరరావు ఇది వరకే కేసు కూడా నమోదు చేశారని తెలిపారు. ఈ హ్యాండ్ బోర్ వ్యక్తి జిరాయితీ స్థలంలో ఉందో, పోరంబోకు స్థలంలో ఉందో సర్వేయర్‌తో సర్వే కూడా చేయించామని, ప్రభుత్వ స్థలంలోనే ఉన్నట్టు సర్వేలో గుర్తించామని తెలిపారు. ఈ మేరకు బోరుకు మరమ్మతులు చేపట్టి అందులోనే హ్యాండ్‌బోరును నిర్మిస్తామని తెలిపారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

గజపతినగరం: అర్హులుగా ఉన్న ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు పంపిణీ చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత తుమికాపల్లి గ్రామ సర్పంచ్ బెల్లాన త్రినాధరావు తెలిపారు. మంగళవారం తుమికాపల్లి గ్రామంలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. గజపతినగరం మండలానికి 16వేల 510 రేషన్ కార్డులు వచ్చాయని వాటిని ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా పంపిణీ చేయడం సంతృప్తికరమేనని అన్నారు. అయితే తుమికాపల్లి గ్రామంలో అర్హులయిన వారందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. కొంతమంది రాలేని వారు కూడా ఉన్నట్లు తెలుస్తుందని వాటి నివేదికలను త్వరలో సేకరించి అధికారులకు పంపిస్తానని అర్హులయిన వారందరికి రేషన్ కార్డులు అందజేయాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

శృంగవరపుకోట: ఏపీ విజిలెన్స్ డీజీ హరీష్ గుప్తా ఆదేశాలతో శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా విభాగం అధికారి బి.ప్రసాద్ నేతృత్వంలో జిల్లాలో ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం కొత్తవలస ఏడీ బి.భానులత, కొత్తవలస విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, ఏజీఎం ఎం.సురేష్‌కుమార్, ఏవో రవీంద్ర తదితరులు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. జేకే అగ్రి ఇండియా ట్రేడర్స్‌లో బిల్లుల్లో వ్యత్యాసాలు గమనించి 6ఏ కేసు నమోదు చేశారు.

జామిలో..

జామి: ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ సీఐ బి.సింహచలం, వ్యవసాయ, రెవెన్యూ శాఖ,పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. భీమసింగిలో మ న గ్రోమోర్, వెంకట కృష్ణ మర్చంట్, జామి రైతు సేవా కేంద్రాలలో తనిఖీలు చేశారు. తహసీల్దార్ కృష్ణంరాజు, ఎస్ఐ వీరబాబు, విజిలెన్స్ హెచ్.సి ఎ.కామేశ్వరరావు, ఏవో పూర్ణిమ, ఏఈవో షేక్ అహ్మద్ ఉన్నారు.

విక్రయాలను నిలిపేసిన అధికారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఎరువుల అమ్మకాల్లో కృత్రిమ కొరత సృష్టించరాదని, తప్పుడు విధానంలో ఎరువులు అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని గరివిడి మండలాధికారులు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీల్లో భాగంగా గరివిడిలో గల శ్రీరాధాకృష్ణ ట్రేడర్స్‌లో మండల ప్రత్యేకాధికారి ఎన్.దామోదరరావు, తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఎంపీడీవో బి.సుబ్రహ్మణ్యం, ఏవో పి.ప్రసాదరావు మంగళవారం తనిఖీలు చేశారు. స్టాకు రిజిస్టర్, నిల్వలను పరిశీలించారు. ఈ ట్రేడర్స్‌లో యూరియా కావాలంటే తప్పనిసరిగా గుళికలు తీసుకోవాలనే తప్పుడు విధానం అవలంభించటంతో 15 రోజుల పాటు ఈ దుకాణంలో ఎలాంటి ఎరువులు అమ్మకాలు చేయరాదని నిషేధించారు. తప్పుడు విధానాలు చేపడితే ట్రేడర్స్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు.

● జోరు వానలోనూ...ఆగని పోరు...



జిందాల్ గతంలో చేసిన ఒప్పందాల మేరకు పేర్లు ఇప్పించాలని కోరుతూ జిందాల్ నిర్వాసితులు మంగళవారం బొడ్డవరలో జోరు వానలోనూ ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. - ఎస్.కోట

● ఆటో కార్మికుల ఆందోళన



తమకు ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఆటో కార్మికులు కొత్తవలస కూడలిలో మంగళవారం ఆందోళన చేశారు. జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్‌తో పాటు గాడి అప్పారావు, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు ఎస్.అప్పలరాజు, సాంబ, శంకరరావు, సూర్యనారాయణ, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. - కొత్తవలస

● చినుకు పడితే.. చిత్తడే...



పెదమానాపురం నుంచి ఇంగిలాపల్లి రోడ్డు ఇలా..



పెదమానాపురం ఆర్వోబీ వద్ద తాత్కాలిక రోడ్డు ఇలా..

దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం నుంచి ఇంగిలాపల్లి వెళ్లే జీటీ రోడ్డులో రెండు కిలోమీటర్ల మేర ఎక్కడ చూసినా గోతులు ఉండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఎక్కడ చూసినా అడుగు నుంచి రెండు అడుగులు లోతులో గోతులు ఉండడంతో ఎక్కడ పడి గాయాల పాలవుతామోనని భయాందోళనలు చెందుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెదమానాపురం ఆర్వోబీ వద్ద ఇరువైపులా పెద్ద గోతులు ఉండడంతో జాతీయ రహదారిపై దూరం నుంచి వస్తున్న వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. - దత్తిరాజేరు

మార్కెట్ కిటకిట



వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలుతో కిటకిట లాడిన మెయిన్‌రోడ్డులోని మార్కెట్

గజపతినగరం :

వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలు కోసం మంగళవారం సాయంత్రం గజపతినగరం మార్కెట్‌కు ప్రజలు పెద్ద ఎత్తున ఒక్కసారిగా తరలి రావడంతో మార్కెట్ సందడిగా మారింది. వినాయక విగ్రహాలతో పాటు పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు భక్తులు అంతా ఎగబడడంతో మార్కెట్ అంతా కిటకిట లాడింది. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం మంగళవారం సాయంత్రం కాస్త విరామం ఇవ్వడంతో భక్తులు పెద్ద ఎత్తున కొనుగోలుకు తరలివచ్చారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశం కమిటీ చైర్మన్ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అసంపూర్ణంగా ఉన్న ఆసుపత్రి భవనం త్వరతగతిన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి నిర్వహణకు మంజూరైన రూ. 43,000లతో ఆసుపత్రిలో స్టేషనరీ, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ మరమ్మతులు నిర్వహించేందుకు తీర్మానించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని చూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.అప్పారావు, వైద్యులు అనీల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలి పూజకు సిద్ధం



చీపురుపల్లి మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న నవభారత్ ఫౌండేషన్ సభ్యులు

తెలుగు రాష్ట్రాల్లో తొలి పూజ వినాయక చవితికి వేళైంది. ప్రతి ఇంటా... వీధుల్లో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. బుధవారం వినాయక విగ్రహాలు నెలకొల్పేందుకు వీధివీధినా కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుద్దీపలంకరణాలతో మండపాలను సిద్ధం చేస్తున్నారు. ఎక్కడ చూసినా వినాయక చవితి సందడి కనిపిస్తోంది. ఒక్కోచోట ఒక్కోలా వీటిని నెలకొల్పేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు కమిటీలు చేస్తున్నాయి. హిందువుల ఇంట తొలి పండగ కావడంతో అంతటా పండగ వాతావరణం కనిపిస్తోంది. చిన్నారులు సందడి చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: చీపురుపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు అందజేస్తున్న విద్యార్థులు



గజపతినగరం రూరల్: వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సీఐ



గుర్ల: మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు